క్లుప్తంగా

కృష్ణవేణి విద్యార్థినులకు వర్సిటీ గోల్డ్ మెడల్స్


జాజం రమ్యకృష్ణ


దోగిపర్తి సాయికళ్యాణి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం డిగ్రీ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులకు వర్సిటీ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులు జాజం రమ్యకృష్ణ బీఎస్సీ విభాగంలోనూ, దోగిపర్తి సాయికళ్యాణి బీకాం విభాగంలోనూ గోల్డ్ మెడల్ సాధించారని వివరించారు. వర్సిటీలో ఈ నెల 29వ తేదీన జరగనున్న వర్సిటీ స్నాతకోత్సవంలో విద్యార్థినులు గోల్డ్ మెడల్ అందుకుంటారని తెలిపారు. విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, అధ్యాపకులు అభినందించారు.

ఆట్యా-పాట్యాలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించారని ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. కర్నూలులో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలలో తమ విద్యార్థులు జె.యశ్వంత్, షేక్.ఆల్‌మాస్ పాల్గొని ప్రథమ స్థానం సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కపలవాయి రాజేంద్ర ప్రసాద్, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, కాట్ల రామకోటేశ్వరరావు, వ్యాయామ అధ్యాపకుడు రాయల ఆంజనేయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని గోకనకొండ గ్రామం వద్ద దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని నాలుగు టన్నుల ఇసుకను సీజ్ చేయడం జరిగిందని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయభాస్కర్‌రావు గురువారం తెలిపారు. దాడుల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్ ఎ.ఆంజనేయులును అదుపులోకి తీసుకున్నామన్నారు.

నేడు గణపవరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో శ్రావణ మాస రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పూజారులు దర్శి అనిల్‌కుమార్ శర్మ, ఉమామహేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వ్రతాలకు హాజరయ్యే భక్తులు ముందుగా అర్చకులను సంప్రదించాలన్నారు.

ఎన్‌డీఏ విజయాలను చేరువ చేయండి

నరసరావుపేట: నాయకులు కార్యకర్తలు ఎక్కువ సమయం పార్టీ కోసం వెచ్చించి ఎన్‌డీఏ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించి పార్టీని ప్రజలకు చేరువ చేసేందుకు కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు సూచించారు. గురువారం పట్టణంలోని దేవి ప్రసాద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన జిల్లాస్థాయి ప్రశిక్షణకు అధ్యక్షత వహించి మాట్లాడారు. చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం వ్యక్తం చేసి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రశిక్షణా ప్రముఖ్ బాధ్యతలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా సంయోజక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పునుగుళ్ళ రవిశంకర్, సీనియర్ నాయకులు వల్లెపు కృపారావు, జిల్లా ఉపాధ్యక్షులు మేడం రమేష్, న్యాయవాది ముండ్రు చంద్రమోహన్ తదితరులు ప్రసంగించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు, అసెంబ్లీ స్థాయి ప్రశిక్షణ ప్రముఖులు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామ శివారు పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు సమాచారం మేరకు పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ. 38 వేల 189 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వరములీయవే వరదాయిని!

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున కాలనీలో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శ్రావణమాసంను పురస్కరించుకొని గురువారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీదేవి అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కెకె విశ్వనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట వివరాలు నమోదు చేసుకోండి

- రైతులకు జేసీ శ్యామ్‌ప్రసాద్ సూచన
- యల్లమందలో పంట నమోదు ప్రక్రియ పరిశీలన


పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఏఓ మురళీ

నరసరావుపేట రూరల్: రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంట వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని యల్లమంద గ్రామంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పంట నమోదు వల్ల రైతులు పలు ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. పంట నమోదు ఆధారంగా ఇన్సూరెన్స్ చేయడం జరుగుతుందన్నారు. ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు నష్టపరిహా రం పొందవచ్చన్నారు. పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో పంట నమోదు తప్పనిసరి అన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేసి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఆయా విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆర్‌బీకేల్లో ఎరువులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. పంట నమోదులో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త జి.రమేష్, జిల్లా కేంద్ర కోఆర్డినేటర్ ఎం.శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏఓ వి.నరేంద్రబాబు, తహసీల్దార్ రమణా నాయక్, ఏఈఓ బ్రహ్మయ్య, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

నరసరావుపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. అసైన్మెంట్ ల్యాండ్ విషయమై తీసుకొంటున్న చర్యలను పరిశీలించారు. 2003కు ముందు ప్రభుత్వ ఆర్డినెన్సు ఆధారంగా వీఆర్వో లాగిన్ నుంచి తహసీల్దార్ లాగిన్‌కు పంపే ప్రక్రియను పరిశీలించి సూచనలు జారీ చేశారు. అసలు అసైనీ, బదిలీ అయిన అసైనీ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. తహసీల్దార్‌కు వచ్చిన లాగిన్ నోటీసు బోర్డులో ఉంచిన ఏడురోజుల తర్వాత ఆర్డీవోకి పంపే ప్రక్రియను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు సంబంధిత అధికారులకు చేశారు. ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

27లోపు పరిశీలన పూర్తి కావాలి


బీఎల్‌వోల సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్ నాగమల్లేశ్వరరావు

యడ్లపాడు: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి తనిఖీల ప్రక్రియ ఈనెల 27వ తేదీ నాటికి పూర్తి చేయాలని సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వర రావు బీఎల్‌వోలను ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఓటరు ధ్రువీకరణ కార్యక్రమంపై బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆయన పలు విషయాల ను బీఎల్‌వోలకు సూచించారు. మండలంలో పరిధిలో మొత్తం 44,250 మంది ఓటర్లు, 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఓటరు ధ్రువీకరణ ప్రక్రియ మండలంలో 98 శాతం పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన జంక్ ఓట్లను ఫారం-8 ద్వారా సరిచేయాలన్నారు. అలాగే ఒకే ఇంటి నంబర్‌లో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. సదరు ఓటర్లు ప్రస్తుతం నివాసం ఉంటున్న డోర్ నంబర్‌ను నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా ఓటర్లు దరఖాస్తు చేసుకున్న మార్పులు, చేర్పులూ నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. అప్పుడు స్వచ్ఛ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు వీలుంటుందన్నారు. గడువులోగా ఆయా వివరాలను ఆన్‌లైన్ సర్వర్‌లో త్వరితగతిన అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికళ, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సింహాద్రి కేశిరెడ్డి (29) ఈ నెల 16వ తేదీ సరుకుల కొనుగోలు కోసం నరసరావుపేట పట్టణానికి వచ్చా డు. సత్తెనపల్లి రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై వస్తూ అదుపు తప్పి పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ

వినుకొండ(నూజెండ్ల): షెడ్యూల్ కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజుమాదిగ డిమాండ్ చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ హాల్ నందు మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడతూ బీజేపీ వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నప్పటికీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించడంలో మాదిగలను నమ్మించి మోసం చేసిన పార్టీగా బీజేపీ నిలుస్తుందన్నారు. త్వరలో హైదరాబాద్ కేంద్రంగా 20 లక్షల మందితో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి నరశింగరావు, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, గార్లపాటి రమేష్, కందుల దేవ, బక్కా ప్రకాష్, మాచర్ల కోటయ్య, కట్టింపూడి ఇమ్మానుయేలు, కోట లక్ష్మయ్య, సీహెచ్. యాకోబు, వినుకొండ నాగేశ్వరరావు, యేసు, బాబురావు, వేల్పుల వెంకయ్య పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

డిప్యూటీ డీఈవో కె.వేణుగోపాలరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిసరాలను ఉపాధ్యాయులు పనితీరు, విద్యార్థుల బోధన తీరును, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించి వంటకాలు రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు పారదర్శకంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్గేలా గుణాత్మక విద్యను ఉపాధ్యాయులు బోధించి మెరుగైన ఫలితాలు విద్యార్థుల సాధించేలా క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల బోధన తీరును పరిశీలించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూరిపాకలోనే కాన్పు చేసిన 108 సిబ్బంది


గర్భిణికి వైద్యసేవలు అందిస్తున్న 108 సిబ్బంది

రొంపిచర్ల: పేద మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుంటే సమాచారం తెలుసుకుని 108 సిబ్బంది అక్కడికి వెళ్లి సుఖ ప్రసవం జరిపిన సంఘటన మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్లితే.. సుబ్బయ్యపాలెం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పూరిపాక, గుడారాలు వేసుకొని కొందరు నివసిస్తున్నారు. అక్కడ నివసిస్తున్న నాంచారమ్మ అనే గర్భిణికి పురిటి నొప్పులు ఆరంభమయ్యాయి. దీంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కంచెర్ల సుబ్రహ్మణ్యం, పైలట్ దారా చినబాబు, ఆశ బత్తుల మల్లేశ్వరిలు ఆమె పరిస్థితిని కనుగొన్నారు. వెంటనే అవసరమైన సెలైన్‌లు, మందులతో వైద్య సేవలు అందించారు. పూరిపాకలోనే పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. బిడ్డ, తల్లి క్షేమంగా ఉన్నారు. స్థానికులు 108 సిబ్బందిని అభినందించారు.

రుద్రవరంలో పశు వైద్యశిబిరం


పశువైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటకృష్ణారెడ్డి, ఏడీ నరసింహారావు

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం, పశువిజ్ఞానబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట డివిజనల్ పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డా.యస్.సిహెచ్.నరసింహరావు పాల్గొని పశుసంవర్ధకశాఖ ద్వారా అందించే కార్యక్రమాలను, పశువిజ్ఞానబడి ద్వారా అందించే సేవలను వివరించారు. సబ్సిడీపై గడ్డికత్తిరించే యంత్రం, 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్, పెయ్యదూడలు పెట్టే వీర్యం గురించి రైతులకు వివరించారు. సత్తెనపల్లి సహాయ సంచాలకులు డా.యమ్.శ్రీనివాసరావు పశువులకు అందించే టీకాల కార్యక్రమం, సీజనల్ వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ముందుగా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 37 సాధారణ పరీక్షలు, 22 గర్భకోశ పరీక్షలు, 40 దూడలకు నట్టల నివారణ మందు, 50 పశువులకు గొంతువాపు టీకాలు అందించారు. మండల పశువైద్యాధికారి కరుణాకరరెడ్డి, పుల్లారెడ్డి, సిబ్బంది ప్రసాద్, వీరబ్రహ్మం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

పెదకూరపాడు: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా గురువారం సత్తెనపల్లిలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కో-ఆర్డినేటర్ రాగిపాటి మాబుల్ పెదకూరపాడు ఎంఈఓ ఏకుల ప్రసాద రావు ఆధ్వర్యంలో ప్రతిభాపరీక్షలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. క్రోసూరు మండలం నుంచి ఎస్‌కె మౌలా జాస్మిన్, షేక్ షాహీద్, అమరావతి మండలం ఎస్‌కే ఆషిక్, అచ్చంపేట మండలం దాసరి అనుష్క, బెల్లంకొండ మండలం కొర్రపాటి అఖిలరాణిలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు ఎంఈఓ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష ఎంతో మాధుర్యమైనదన్నారు. ప్రతిభ కనబరిచి ఐదుగురు విద్యార్థులు ఈనెల 26న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగే జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలోవివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ


వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు


ర్యాలీగా వస్తున్న కేసానుపల్లి పాఠశాల ఉపాధ్యాయిలు, విద్యార్థులు


నరసరావుపేటలో ర్యాలీ చేస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు


మతుకుమల్లి శ్రీప్రసన్న స్కూలు విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ


రొంపిచర్లలో పూలతో అలంకరించిన శాటిలైట్ నమూనా ఎదుట విద్యార్థినులు

వినుకొండ(నూజెండ్ల): అంతర్జాతీయ స్థాయిలో 140 కోట్ల భారతీయులు గర్వపడేలా భారతదేశ శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగించి విజయం సాధించడంపై స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ -3 బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి మీద అడుగుపెట్టిందని, అమెరికా, రష్యా, చైనాల తరువాత భారతదేశం చంద్రుడిపై అడుగుపెట్టిన 4వ దేశంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన మొట్టమొదటి దేశంగా నిలిచిందన్నారు. 4 వేల కిలోల బరువుతో సాగిన చంద్రయాన్-3 ప్రయాణం రోవర్ చంద్రుని దింపుటలో సఫలమైందన్నారు. ఇందులో ప్రజ్ఞాన్ చంద్రుని మీద వాతావరణం, అక్కడి రసాయన మూలకాలు, చంద్రునిపై జీవనం సాగించుటకు గల అంశాలను అధ్యయనం చేస్తుందన్నారు. భారతదేశానికి, ఇస్రో టీంకు అభినందనలు తెలుపుతూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు జయహో భారత్, జయహో ఇస్రో అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ కె.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు సిద్ధిక్, చంద్రశేఖర్, పట్టాభి రామారావు, ధన కోటేశ్వరరావు, ఎం.రమాదేవి, ఆర్.నాసరమ్మ పాల్గొన్నారు.

వితంరాజుపల్లిలో...

చంద్రయాన్-3 విజయోత్సవం సందర్భంగా వితంరాజుపల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హిమాలయ గురువు పాల్గొని కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెండేల సురేష్, తాతా రమేష్, డాల్ మిల్లర్స్ ఎ. ప్రవీన్, అశోక్‌రెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని శ్రీసాయి ప్రసన్న స్కూల్, మండల కేంద్రంలో శ్రీరామా పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల సారథ్యంలో గురువారం విజయోత్సవ కార్యక్రమాలు. జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్స్ పి.సింహారాయులు, కె.వి.ఆర్. మోహన్‌చందు, ప్రిన్సిపాల్స్ పి.అరుణాదేవి, కె.రత్నకుమారి గ్రామస్తులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: మండలంలోని ఎస్‌ఆర్‌కెటి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గురులింగం ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. భారతదేశ కీర్తిని చంద్రయాన్-3 విజయం ప్రపంచానికి చాటిందన్నారు. ఈ విజయం ఎంతో మంది విద్యార్థులను అంతరిక్ష పరిశోధనల వైపు దృష్టి పెట్టేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు త్రివర్ణ పతకాలు చేతబూని కాలనీలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సుధాకర్, ఎమ్.అపర్ణ, ఎస్. సుబ్బారావు, ఫాతిమాలు పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: చంద్రయాన్-3 విజయవంతం కావటాన్ని పురస్కరించుకొని టైనీటాట్స్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తు విద్యార్థులు నినాదాలు చేశారు. జయహో భారత్, జయహో ఇస్రో నినాదాలతో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పాతూరి శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, కరణం కొండలరావు, ఏఓ యలవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావటాన్ని పురస్కరించుకొని సంతగుడిపాడు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్ శాటిలైట్ నమూనాను పాఠశాలలో రంగులతో ముగ్గులు వేసి పూలతో అలంకరించారు. గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. బాలికలందరూ మానవహారం ఏర్పాటయ్యారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత ఖ్యాతి ప్రపంచంలో ఎలుగెత్తి చాటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం

నకరికల్లు: భవితకేంద్రం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వరం లాంటిదని ఎంఈఓ-2 ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీ వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఎంఈఓ మాట్లాడుతూ భవితకేంద్రంలో శిక్షణపొందుతున్న పిల్లలకు కావలసిన ఉపకరణాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. పిల్లల స్థితిని గుర్తించి వారికి అర్థమయ్యే విధంగా బోధించడం, వారి బాగోగులు చూడడం గొప్ప సేవా కార్యక్రమమని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ప్రతి గురువారం ఉచిత వైద్యశిబిరంతో పాటు, శనివారం విద్యార్థుల ఇంటివద్దకు వెళ్లి ఉపాధ్యాయులు శిక్షణను ఇస్తారని అన్నారు. హెచ్‌ఎం మేదరమెట్ల స్వామి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు బి.రమేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

దూరవిద్య విధానంతో చదువు కొనసాగించొచ్చు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అక్బర్ ఆలీ, హుస్సేన్, కేవీ సుబ్బారెడ్డి, ఒంగోలు రాజు

ముప్పాళ్ళ: మధ్యలో ఆగిపోయిన చదువును దూర విద్యా విధానం ద్వారా మళ్లీ కొనసాగించవచ్చని అపోస్ (ఏపీ ఓపెన్ స్కూల్) రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ చెప్పారు. మండలంలోని ముప్పాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో అపోస్ అడ్మిషన్ల ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(దూర విద్యా విధానం) ద్వారా 2023-24 విద్యాసంవత్సరం పదవతరగతి, ఇంటర్మీడియట్‌ను పూర్తి చేయవచ్చన్నారు. బడి మానేసి 14 సంవత్సరాలు నిండిన అందరూ పదవ తరగతిలో చేరవచ్చన్నారు. అలాగే 15 సంవత్సరాలు నిండి పదవతరగతి పూర్తయిన వారందరూ ఇంటర్మీడియట్ కోర్సు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడియట్ మానివేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, సులభమైన స్వయం అభ్యసన సామగ్రి అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఏపీఆన్‌లైన్ ద్వారా గాని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా అపోస్(దూర విద్యావిధానం) కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జడ్పీ పాఠశాలలోను, చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలోను ఆవిష్కరించారు.అపోస్ ఏడీ కేఎంఏ హుస్సేన్, డిస్టిక్ కో-ఆర్డినేటర్ కె.వి.సుబ్బారెడ్డి, ఎంఈఓ ఒంగోలురాజు, పాఠశాల హెచ్‌ఎం కుంభా నాగేంద్రమ్మ, పి.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపవరంలో పశువిజ్ఞాన బడి


పాడిరైతులతో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి శ్రీధర్

నాదెండ్ల: గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ సర్వే జరుగుతున్నదని, పాడి రైతులు తమ పశువుల వివరాలు నమోదు చేయించుకోవాలని గణపవరం గ్రామీణ పశువైద్యాధికారి ఎం.శ్రీధర్ చెప్పారు. పశు వైద్యశాలలో పశువిజ్ఞానబడి నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల పరిధిలో ఇర్లపాడు, అప్పాపురం గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 82 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారన్నారు. ఇప్పటికే 62 మంది లబ్ధిదారులు, వలంటీర్ల యాప్‌లో రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటీవల యజమానులకు 1500 కేజీల పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశామన్నారు. గర్భ నిర్ధారణ పరీక్షలు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయన్నారు. పశు యజమానులు గ్రామీణ పశు వైద్యశాలలో వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు.